క్లుప్తంగా...

సీతారాంరెడ్డికి అక్బరుద్దీన్ పరామర్శ



చాంద్రాయణగుట్ట: అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చాంద్రాయణగుట్ట నియోజకవర్గం బీఆర్ఎస్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఇన్‌చార్జి ముప్పిడి సీతారాంరెడ్డిని చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ పరామర్శించారు. శాలిబండలోని అస్రా ఆస్పత్రికి శనివారం రాత్రి వచ్చిన ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఈ సందర్భంగా తన ఆస్పత్రి వైద్యులకు ఆయన సూచించారు. అధైర్యపడొద్దని కుటుంబ సభ్యులకు అభయమిచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకుడు జమ్మిచెట్టు రాజు తదితరులున్నారు.

మతసామరస్యానికి హైదరాబాద్ పెట్టింది పేరు



సౌత్ వెస్ట్ జోన్ డీసీపీతో మైత్రి కమిటీ సభ్యులు ఎస్. రాజువస్తాద్ తదితరులు

గోల్కొండ: మతసామరస్యానికి హైదరాబాద్ నగరం పెట్టింది పేరు అని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్ ఖరే అన్నారు. గోల్కొండ డివిజన్ పీస్ అండ్ మైత్రి కమిటీ వెల్ఫేర్ కమిటీ సభ్యులు శనివారం ఆయనను మెహిదీపట్నంలోని డీసీపీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా మైత్రి కమిటీ అధ్యక్షుడు ఎస్. రాజు వస్తాద్ కమిటీ సభ్యులతో కలిసి డీసీపీకి పుష్ప గుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. తన పూర్తి పదవీ కాలంలో హైదరాబాద్ నగరం లాంటి ప్రజలను ఎక్కడా చూడలేదన్నారు. బోనాలు, మొహర్రం సంతాప దినాలు, వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా నగరంలోని అన్ని వర్గాల ప్రజలు కలిసి మెలిసి పండుగలను శాంతియుతంగా నిర్వహిస్తారన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా బోనాలు గోల్కొండ కోటలోనే ప్రారంభమవుతాయన్నారు. బోనాలను రాష్ట్ర పండుగగా జరుపుతున్నప్పటి నుంచి కోట బోనాలకు లక్షలాదిగా భక్తులు తరలి వస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మైత్రి కమిటీ సభ్యులు ఆబెద్, ఇలియాస్ అక్బర్, వేణు, మహ్మద్ షానవాజ్ ఖాన్, అక్బర్, ఎంఏ బేగ్, ఎ. పరమానందం, డి. సత్యనారాయణ, జంగయ్య తదితరులున్నారు.

ఆలయ పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం



చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట చెన్నకేశవ స్వామి ఆలయ నూతన పాలక మండలి సభ్యులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ఈఓ శివరుద్రప్ప ఈ మేరకు నూతన పాలక మండలి సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, రవి, ఉమారాణి, మీనాక్షి, చంద్రశేఖర్, జుర్కీ సంతోషి రాణి, అర్చనచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ పాలక మండలి ఏడాది పాటు కొనసాగనున్నట్లు ఆయన తెలిపారు. పాలక మండలి సమావేశమై నూతన చైర్మన్‌ను ఎన్నుకుంటారన్నారు. ఈ సందర్భంగా పాలక మండలి సభ్యులు దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, హోం మంత్రి మహమూద్ అలీ లకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ అఫిషియో మెంబర్ కంజర్ల ప్రతాపాచార్యులు, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సురేందర్, స్థానిక నాయకులు జుర్కీ రాజేందర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నమాచార్య జయంతి వేడుకలు



గన్‌ఫౌండ్రీ: అన్నమయ్య సంకీర్తనలు ఎంతో మధురమైనవని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి అన్నారు. శనివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీరామ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్య 615వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రచయిత గరికపాటి వెంకట్ రూపొందించిన అన్నమయ్య హరి సిరి పద ఝురి గ్రంథాన్ని ఆవిష్కరించారు. అనంతరం శ్రీనిధి వెంకటేష్ శిష్యబృందం ఆలపించిన అన్నమయ్య కీర్తలను ఆకట్టుకున్నాయి. సినీనటుడు తనికెళ్ల భరణి, సాహితీ వేత్త ఓలేటి పార్వతీశం, భాషా సాంస్కృలతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, రచయిత సుధామ, సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆర్‌ఓబీ రెండో లేన్ నిర్మాణమెప్పుడో?

- ఒక లేన్‌లోనే ఇరువైపులా వాహనాల రాకపోకలు
- శ్మశాన వాటికకు అడ్డంకిగా మారిన పెండింగ్ పనులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



ఒక లేన్‌లోనే పూర్తయిన ఫలక్‌నుమా ఆర్‌ఓబీ

చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమా రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) రెండో రూట్ నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఒకవైపు మాత్రమే వెళ్లాల్సిన వన్ వే వంతెనపై రెండో వంతెన పూర్తి కాని కారణంగా రెండు వైపులా వాహనాల రాకపోకలను అనుమతించారు. ఐదారు నెలల్లో రెండో వంతెన అందుబాటులోకి వస్తే సాఫీగా రాకపోకలు సాగించవచ్చన్న వాహనదారుల ఆశలు ఇప్పట్లో నెరవేరేలా కనిపించడం లేదు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుండడంతో ప్రమాదపుటంచున వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి.



ప్రయాణికులు రైల్వేస్టేషన్‌కు చేరుకునేందుకు ఏర్పాటు చేసిన బాక్స్ మార్గం

ఇప్పటికే ఎన్నో ప్రమాదాలు సైతం జరిగి వాహనదారులు క్షతగాత్రులుగా మారిన సందర్భాలున్నాయి. జీహెచ్ఎంసీ అధికారులు ఇప్పటికైనా స్పందించి రెండో వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

పాత వంతెన శిథిలావస్థకు చేరడంతో..

ఫలక్‌నుమా రైల్వే పట్టాలపై దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకొని.. 2020 అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాలకు కృంగిపోయి ప్రమాదకరంగా మారిన విషయం విధితమే. ఒక వైపు బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడం.. మరో వైపు విస్తీర్ణం సైతం తక్కువగా ఉండడంతో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాలతో రద్దీగా మారుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ బ్రిడ్జిని ఆధునీకరించడంతో పాటు.. దీని పక్కనుంచే మరో నూతన బ్రిడ్జి కూడా నిర్మించేందుకు జీహెచ్ఎంసీ శ్రీకారం చుట్టింది. ఫలక్‌నుమా నుంచి చాంద్రాయణగుట్ట రూట్‌లో పోయే వాహనాలు ఒక బ్రిడ్జిపై.. వచ్చే వాహనాలు మరో బ్రిడ్జిపై వెళ్లేలా దాదాపు రూ.52 కోట్లతో పనులను ప్రారంభించారు. 2021 మార్చిలో వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేధించి చాంద్రాయణగుట్ట వైపు వెళ్లే వంతెన పనులను పూర్తి చేసి అదే ఏడాది నవంబర్ 2వ తేదీనా వాహనదారులకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

వంతెన కింద నాలా మార్గం.. పాదచారులకు బాక్స్ మార్గం..

ఈ బ్రిడ్జికి ఎగువన హషామాబాద్ నుంచి వచ్చే నల్లవాగు నాలా నీరు ఈ బ్రిడ్జి కింది నుంచి సాఫీగా వెళ్లేందుకు భారీ బాక్స్ డ్రైన్‌లను నిర్మించారు. పైన ఉన్న పల్లె చెరువు నుంచి ఎంత పెద్ద వరద వచ్చినా ఈ బ్రిడ్జికి అవరోధం కలగకుండా కాంక్రీట్‌తో నాలా మార్గాన్ని ఏర్పాటు చేశారు. దీంతో పాటు రైల్వే ప్రయాణికులు కూడా సాఫీగా ఫలక్‌నుమా రైల్వే స్టేషన్‌కు చేరుకునేలా భారీ కాంక్రీట్ బాక్స్‌ను ఏర్పాటు చేశారు. బ్రిడ్జిపై పాదచారులు వెళ్లేందుకు కూడా వాహనాలతో సంబంధం లేకుండా ప్రత్యేక లైన్‌ను నిర్మించారు.

సరైన మార్గం లేకపోవడంతో..

రైల్వే బ్రిడ్జి సమీపంలోనే ఉన్న హిందూ శ్మశానవాటికకు పెండింగ్‌లో ఉన్న వంతెన నిర్మాణ పనులు అడ్డంకిగా మారాయి. సరైన మార్గం లేని కారణంగా అంత్యక్రియలు నిర్వహించేందుకు జంగమ్మెట్, ఫలక్‌నుమాలకు చెందిన ప్రజలు చుట్టూ తిరిగి నల్లవాగు శ్మశానవాటికకు చేరుకోవాల్సి వస్తుంది. శ్మశాన వాటికలు ఎలాంటి కార్యక్రమాలు జరగకపోవడాన్ని అదునుగా భావించిన కొందరు అక్రమార్కులు నకిలీ పేపర్లతో ఈ శ్మశాన వాటికను కబ్జా చేసేందుకు యత్నిస్తుండడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రెండేళ్లు దాటుతున్నా పూర్తి చేయరా..



కేవలం ఆరు నెలల్లో పూర్తి చేస్తామన్న జీహెచ్ఎంసీ అధికారులు ఒక వైపు వంతెన నిర్మించి చేతులు దులుపుకున్నారు. వంతెన ఇరుకుగా మారడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తాగునీటి పైప్‌లైన్ కూడా ఇప్పటికే మార్చినందున వెంటనే నిర్మాణ పనులు పూర్తి చేసి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి. పనుల పెండింగ్ కారణంగా శ్మశాన వాటికకు ప్రజలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

– శ్యాంరావు ముదిరాజ్, కాంగ్రెస్ నేత

అమర్‌నాథ్ యాత్రికులకు ఉస్మానియాలో వైద్య పరీక్షలు

అఫ్జల్‌గంజ్: అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే భక్తులకు ఉస్మానియా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ పర్యవేక్షణలో ముగ్గురు వైద్యులకు ఈ బాధ్యతలు అప్పగించారు. సోమ, గురువారాల్లో డాక్టర్ కేఎంకే రెడ్డి (కార్డియాలజీ) ఆధ్వర్యంలో అవుట్ పేషంట్ బ్లాకులోని రూమ్ నంబర్ 208 వద్ద, మంగళ, శుక్రవారాల్లో డాక్టర్ పి. శ్రవణ్‌కుమార్ (జనరల్ మెడిసిన్) ఆధ్వర్యంలో ఎంఆర్‌డీ బిల్డింగ్‌లోని రూం నంబర్ 507 వద్ద, బుధ, శనివారాల్లో డాక్టర్ ఎ.కృష్ణారెడ్డి (ఆర్థోపెడిక్) ఆధ్వర్యంలో ఓపీ బ్లాకులోని రూమ్ నంబర్ 125 వద్ద ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈసీజీ, 2డీ ఈకో, ఎక్స్‌రే వంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారు. వైద్య పరీక్షలు నిమిత్తం వచ్చే వారు తమ ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలని, మరిన్ని వివరాలకు 99896 76293 నంబర్‌లో సంప్రదించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగేందర్ తెలిపారు.

'కర్ణాటకలో కాంగ్రెస్ విజయం ఖాయం'

గోల్కొండ: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకుడు కురకుల కృష్ణ అన్నారు. ప్రజల మధ్య చిచ్చు పెట్టి అధికారంలోకి వచ్చే బీజేపీ నైజాన్ని ప్రజలు గుర్తిస్తున్నారని ఆయన అన్నారు. దేశంలోని పలు రాష్ట్రాలలో ప్రజాసస్వామ్యబద్ధంగా ప్రభుత్వాలను పడగొట్టి దొడ్డిదారిన అధికారాలను కైవసం చేసుకుందని ఆయన అన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ

యాకుత్‌పురా: ప్రభుత్వం అందజేసే సంకేమ పథకాలను అర్హులైన పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ సూచించారు. చార్మినార్ మండల కార్యాలయ అధికారుల ఆధ్వర్యంలో శనివారం తలాబ్‌కట్టాలోని షార్జాహాన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అర్హులైన 93 మంది లబ్ధిదారులకు షాదీ ముబారాక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న పేదలు సంక్షేమ పథకాలపై అవగాహన ఏర్పార్చుకోవాన్నారు. నియోజకవర్గంలోని అనేక మంది పేదలకు షాదీ ముబారాక్ పథకం ద్వారా ఎంతో మేలు జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తలాబ్‌చంచలం, డబీర్‌పురా, మొఘల్‌పురా డివిజన్ల కార్పొరేటర్లు డాక్టర్ సమీనాబేగం, అలాందార్ వాలాజహి, నస్రీన్ సుల్తానా, చార్మినార్ డిప్యూటీ తహసీల్దార్ మహ్మద్ అసిఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు బుద్ధి ప్రసాదించాలని అమరవీరులకు వినతి



అమరవీరుల స్థూపానికి వినతిపత్రం అందజేస్తున్న రాచాల యుగంధర్‌గౌడ్

నాంపల్లి: ఐకేపీ వీఓఏల డిమాండ్లు వెంటనే పరిష్కరించకపోతే వీఓఏలతో కలిసి ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని బీసీ పొలిటికల్ జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం గన్‌పార్కు వద్ద వీఓఏలతో కలిసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఐకేపీ వీఓఏ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని 20 రోజులుగా సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. 20 ఏళ్లుగా పనిచేస్తున్న వీరికి నెలకు కేవలం రూ.3,900 వేతనం ఇస్తూ 30 రకాల పనులు చేయిస్తూ తీవ్ర శ్రమ దోపిడీకి పాల్పడుతుందన్నారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించి రూ.10 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వీఓఏల న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం కేసీఆర్, కేటీఆర్‌లకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ అమరవీరుల స్థూపానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు శేఖర్ గౌడ్, స్వామి నాయుడు, ఐకేపీ వీఓఏల సంఘం నాయకులు శాంతయ్య, రమేష్, నరసింహ, అలివేలు, స్వప్న, జయమ్మ, అరుణ, కవిత, మంజుల బాలరాజు, నరేష్, చెంద్రాయుడు, చిన్నంబావి నరసింహ, బాలస్వామి, పద్మ పాల్గొన్నారు.

మెథడిస్ట్‌లో 'కంటివెలుగు'



కంటివెలుగులో వైద్య పరీక్షలు చేయించుకుని కంటి అద్దాలు తీసుకున్న సిబ్బంది, ఉద్యోగులు

అబిడ్స్: మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాలలో కంటివెలుగు కార్యక్రమం నిర్వహించారు. కళాశాలలోని ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులకు కూడా కంటి పరీక్షలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్ద ఎత్తున కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభుజీ బెనోకప్, డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ.. తమ కళాశాలలో విద్యార్థులు, ఉద్యోగులు, సిబ్బంది సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. విద్యార్థుల, సిబ్బంది ఆరోగ్యం ఎంతో ముఖ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబీఏ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ డాక్టర్ ఎం.సుజాత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ భరత్‌నాయక్, పీఆర్ఓ ఆర్.శ్రీకాంత్‌తో పాటు పెద్దఎత్తున సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

9 నుంచి 'ఖేలో భారత్.. జీతో భాగ్యనగర్'



మాట్లాడుతున్న కార్పొరేటర్ శంకర్‌యాదవ్, భీశ్వ ఓంప్రకాష్ తదితరులు

సుల్తాన్‌బజార్: భాగ్యనగర్‌లోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు హైదరాబాద్ పార్లమెంట్‌లో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో 'ఖేలో భారత్.. జీతో భాగ్యనగర్'పేరుతో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని క్రీడల కన్వీనర్, బేగంబజార్ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, బీజేపీ రాష్ట్ర దళిత మోర్చా ఉపాధ్యక్షుడు భీశ్వ ఓంప్రకాష్ అన్నారు. ఈ మేరకు శనివారం విక్టోరియా ప్లే గ్రౌండ్‌లోని ఇండోర్ స్టేడియంలో బీజేపీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ప్రతిభ ఉండి ఆదరణ లేక మరుగున పడుతున్న క్రీడాకారులను వెలికితీసేందుకు ప్రధాని నరేంద్రమోదీ ఈ బృహత్తర క్రీడా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో భాగంగా ఈనెల 9 నుంచి 12 వరకు ఐదు క్రీడాంశాల్లో (కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, అథ్లెటిక్) 16 సంవత్సరాల పైబడిన వారికి నిర్వహిస్తున్నామన్నారు. 9న సాయంత్రం 5 గంటలకు విక్టోరియా ప్లే గ్రౌండ్‌లో ప్రారంభిస్తున్నామన్నారు. ముఖ్యఅతిథులుగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఓబీసీ నేషనల్ చైర్మన్ హన్సరాజ్ గంగారామ్ అయ్యార్, ఎంపీ లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గోషామహల్ కన్వీనర్ కృష్ణ, హైదరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, సికింద్రాబాద్ ప్రభావరి రవీందర్‌రెడ్డి, మంగళ్‌హాట్ కార్పొరేటర్ శశికళ, గోల్కొండ జిల్లా బీజేవైఎం నాయకులు నితిన్ నందేకర్ పాల్గొన్నారు.

రాజాసింగ్ 9 ఏళ్లలో ఎలాంటి అభివృద్ధి చేయలేదు

- అభివృద్ధి చూపిస్తే రూ. 11 లక్షలిస్తానంటూ సవాల్



అబిడ్స్: గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తొమ్మిది సంవత్సరాల ఎమ్మెల్యే పదవిలో నియోజకవర్గానికి ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేసినా తనవంతుగా రూ.11 లక్షల నగదు చెక్కును ఇస్తానని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు. శనివారం అబిడ్స్ జీపీఓ చౌరస్తా వద్ద రూ.11 లక్షల చెక్కు పోస్టర్ కార్డుతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గడ్డం శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ... గోషామహల్ నియోజకవర్గం అభివృద్ధిలో రాజాసింగ్ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. రాజాసింగ్ డబ్బుల కోసం ఏమైనా చేస్తారని మతం, దేవుడిని అడ్డం పెట్టుకుని రాజాసింగ్ అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

నియామకం



అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఉద్యమ నేత గడ్డమీది యాదగిరి నియమితులయ్యారు. ఆయనను నియమిస్తూ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ బిలాల్ ఆదేశాలు జారీ చేస్తూ అందజేశారు. ఈ సందర్భంగా గడ్డమీది యాదగిరి మాట్లాడుతూ.. నియోజకవర్గం నలుమూలలా దళితుల సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తానన్నారు. ఉద్యమ నాయకులకు బిలాల్ సరైన గుర్తింపు ఇస్తున్నారన్నారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన నంద కిశోర్ వ్యాస్ బిలాల్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



గన్‌ఫౌండ్రీ: సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని తెలంగాణ మహిళా విశ్వ విద్యాయలం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ విజ్జులత అన్నారు. శనివారం రవీంద్రభారతిలో అనిబిసెంట్ మహిళా కళాశాల స్నాతకోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సోషల్ మీడియా పట్ల బాలికలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డిగ్రీ పట్టాలు పొందుతున్నారంటే జీవితం ఆరంభమవుతున్నట్లే అన్నారు. అనంతరం విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. అంతకు ముందు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఓయూ తెలుగు శాఖ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్, పద్మశ్రీ శాంతి సింహ పాల్గొన్నారు.

నవ్యనాటక సమితి 65వ వార్షికోత్సవాలు



గొల్లా కళాపంలో పాల్గొన్న నృత్య గురువులను సత్కరిస్తున్న దృశ్యం

సుల్తాన్‌బజార్: నృత్యం, సంగీతం, లలిత కళలు భారతీయ సంస్కృతిలో భాగాలని వీటిని పరిరక్షించి భావితరాలకు అందించేందుకు నృత్య గురువులు, కళాకారులు కృషి చేయాలని హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయ నృత్యకారులు డాక్టర్ జొన్నల గడ్డ అనురాధ అన్నారు. నవ్యనాటక సమితి 65వ వార్షికోత్సవాల్లో భాగంగా కూచిపూడి కళా ప్రక్రియ 'గొల్ల కలాపం'పై నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ శిబిరాన్ని డాక్టర్ జొన్నలగడ్డ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. భామా కళాపం, కూచిపూడి నృత్య ప్రత్యేకతలన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న రాష్ట్ర కల్యాణ, లెక్కల శాఖ ఉప సంచాలకులు జి.వసుంధర నృత్య గురువులకు, యువ కళాకారులకు ఉపయోగపడే విధంగా గొల్ల కలాపంపై వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్న నాట్యాచార్యులు ఆచార్య భాగవతుల సేతురామ్‌ను నవ్యనాటక సమితి ఘనంగా సన్మానించింది. ప్రముఖ నృత్య గురువులు ఓలేటి రంగామణి, ఆర్. ప్రసన్న రాణి, శ్రీనివాస్‌లతో పాటు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించాలి

చాంద్రాయణగుట్ట: నిర్మాణం పూర్తి చేసుకున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను వెంటనే పేదలకు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మహ్మద్ అబ్బాస్ అన్నారు. సీపీఎం చాంద్రాయణగుట్ట జోన్ కమిటీ ఆధ్వర్యంలో బండ్లగూడ గౌస్‌నగర్‌లో శనివారం ఇళ్ల సాధన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు నిర్మించి ఇస్తామని కేసీఆర్ సర్కార్ హామీ ఇచ్చిందని.. కాని ఏళ్లు గడుస్తున్నా కేటాయింపులు జరగడం లేదన్నారు. గౌస్‌నగర్, జంగమ్మెట్‌లో నిర్మాణం పూర్తయిన ఇళ్లను స్థానిక పేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.కిషన్, కృష్ణ, స్వామి, జీవన్, శ్రీను, మీరాజ్, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న చంద్రమోహన్‌గౌడ్

గౌలిపురా: ప్రజల ఓట్లతో గద్దెనెక్కిన ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా వ్యతిరేక, నిరంకుశ పాలన కొనసాగిస్తున్నాడని.. ఇలాంటి నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా రానున్న ఎన్నికల్లో ప్రజలు ఓట్లేసి కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కార్‌కు తగిన బుద్ధి చెప్పాలని సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.చంద్రమోహన్‌గౌడ్ అన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలును విస్మరించిన మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని కోరుతూ శనివారం 'బీజేపీ కో హటావో.. దేశ్ కో బచావో'అనే నినాదంతో సీపీఐ పార్టీ పిలుపు మేరకు గౌలిపురా డివిజన్ ఛత్రినాక, దానయ్యనగర్, అచ్చయ్యనగర్, హనుమాన్‌నగర్, శ్రీరాంనగర్ కాలనీ, అయోధ్యనగర్ ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహిస్తూ కరపత్రాలను పంపిణీ చేస్తూ బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో పన్నులు మీద పన్నులు విధిస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ ప్రజల రక్తాన్ని తాగుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గౌలిపురా డివిజన్ సహాయ కార్యదర్శి ఎన్.అనిల్‌కుమార్, కార్యవర్గ సభ్యులు కృష్ణగౌడ్, ప్రభాకర్, యువజన నాయకులు దేవేందర్, భవానీ, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య రవ్వా శ్రీహరి చిరస్మరణీయులు



ఆచార్య రవ్వా శ్రీహరి సంస్మరణ సభలో ఆచార్య ఎల్లూరి శివారెడ్డి తదితరులు

సుల్తాన్‌బజార్: పేదరికాన్ని అధిగమించి స్వయం కృషితో, కఠోర పరిశ్రమతో ఉన్నత శిఖరాలు అధిరోహించిన ఆచార్య రవ్వా శ్రీహరి చిరస్మరణీయులని వక్తలు అన్నారు. ఇటీవల కన్నుమూసిన మహామహోపాధ్యాయ, ద్రావిడ విశ్వ విద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య రవ్వా శ్రీహరి సంస్మరణ సభను తెలంగాణ సారస్వత పరిషత్తు శనివారం ఏర్పాటు చేసింది. పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రసంగించిన పలువురు సాహితీవేత్తలు ఆచార్య శ్రీహరికి నివాళులర్పించారు. సంస్కృత, తెలుగు భాషా సాహిత్యాలలో బోధన, పరిశోధన చేయటంతో పాటు నిఘంటు నిర్మాణం వ్యాకరణం వంటి అంశాల్లో విశేషమైన ప్రజ్ఞా పాటవాలతో అనేక సాహిత్య క్షేత్రాల్లో రవ్వా శ్రీహరి బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించారని ఎల్లూరి శివారెడ్డి ఈ సందర్భంగా అన్నారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య మాట్లాడుతూ.. 1983 నుంచి రవ్వా శ్రీహరికి సారస్వత పరిషత్తుతో గాఢమైన అనుబంధం ఉందని, కార్యవర్గ సభ్యులుగా పరీక్షా కార్యదర్శిగా, 10 ఏళ్ల పాటు ప్రధాన కార్యదర్శిగా, ట్రస్టు సభ్యులుగా సేవలు అందించారని పేర్కొన్నారు. కోశాధికారి మంత్రి రామారావు ప్రసంగిస్తూ శ్రీహరి మట్టిలో మాణిక్యం అని, అంతటి కృషిని తమ జీవితంలో సాగించారన్నారు. ఆచార్య టి.గౌరీ శంకర్ మాట్లాడుతూ.. ఆచార్య శ్రీహరి స్నాతకోత్తర స్థాయిలో తమకు వ్యాకరణం బోధించారని, తరువాత వారితో పాటు భాషా శాస్త్రంలో డిప్లొమా కోర్సు అధ్యయనం చేసే అవకాశం లభించిందని తెలిపారు. డాక్టర్ వసుంధరారెడ్డి మాట్లాడుతూ.. సారస్వత పరిషత్తులో ఆచార్య రవ్వా శ్రీహరి చేసిన కృషిని చూసి ఎంతగానో ఆనందించానని పేర్కొన్నారు. రవ్వా శ్రీహరి పెద్ద కుమారుడు రమేష్ కుమార్ మాట్లాడుతూ.... తమ తండ్రి నుంచి సాహిత్య విద్యను నేర్చుకోకపోయినా ఉత్తమ సంస్కారాన్ని అలవర్చుకున్నామన్నారు.